క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నిడదవోలు: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. పట్టణంలో బస్టాండ్ రోడ్డు, జెండాల వీధి, గొడవీధి, రజక పేట, హరిత హాస్పిటల్ ప్రాంతాలతో పాటు పట్టణంలో ట్రీ కటింగ్ నిమిత్తం అన్నపూర్ణనగర్, బసివిరెడ్డిపేటలో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని బసివిరెడ్డి పేట, పురుషోత్తపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని సమిశ్రగూడెం, అట్లపాడు, గోపవరం, విజ్జేశ్వరం, పురుషోత్తపల్లి, పందలపర్రు, డి.ముప్పవరం, కలవచర్ల, జీడిగుంట, కోరుపల్లి, మునిపల్లి గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఈనెల 20 తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గృహ, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సంబంధిత గ్రామాల విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలన్నారు.

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల విద్యుత్ సెక్షన్ పరిధిలోని దేవరపల్లి, పల్లంట్ల గ్రామాల్లోని 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవరపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం, గొల్లగూడెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు వివరించారు.

డీలర్లకు ఈ-పోస్ యంత్రాల అందజేత



చాగల్లులో డీలర్లకు ఈ-పోస్ యంత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ మేరికమ్మ

చాగల్లు: రేషన్ షాపుల్లో కార్డుదారులకు సరుకుల పంపిణీ కోసం వినియోగించడానికి నూతన ఈ-పోస్ యంత్రాలను తహసీల్దార్ ఎం.మేరికమ్మ శుక్రవారం డీలర్లకు అందజేశారు. చాగల్లు తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. నూతన టెక్నాలజీతో ఈ-పోస్ యంత్రం ద్వారా సులభతరంగా సరుకులు అందించాలన్నారు. రేషన్ షాపుల నిర్వాహకులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు ఎం.సునీత, కమల్, రేషన్ డీలర్లు కృష్ణ, సుబ్బారావు, జగదీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

నిడదవోలు: పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటర్లో వేంచేసిన పూజా గణపతి, కుమారస్వామి వార్ల ఆలయం వద్ద 108వ వార్షికోత్సవ గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 11 గంటలకు స్వామివారి బ్రహ్మాండమైన భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ అన్న సమారాధనలో ప్రతి ఒక్కరూ (భక్తులు), దాతలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆయన ఆకాంక్షించారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

నిడదవోలు: పట్టణంలో లాల్‌బహదూర్ శాస్త్రి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బీజేపీ నాయకుడు రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బండి సత్యనారాయణ, తోరం జయ శ్రీనివాస్, కృపానందం, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



చిట్యాల ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

గోపాలపురం: మండలంలోని చిట్యాల, గోపాలపురం గ్రామాల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. సీఐ జి.మధుబాబు మాట్లాడుతూ చిట్యాల భవానీ ఎంటర్ ప్రైజెస్‌లో ఎరువులకు సంబంధించిన రికార్డులు పరిశీలించినట్లు తెలిపారు. గోపాలపురం పీఏసీసీలో అయిదు కంపెనీలకు చెందిన ఎరువులకు సంబంధించి ప్రభుత్వ అనుమతులు లేకుండా రూ.15.38 లక్షల మేర ఎరువులు విక్రయించినట్లు గుర్తించామన్నారు. రికార్డులు సరిచేసుకొని అధికారికంగా నమోదు చేయించాలని కార్యదర్శికి సూచించారు. ఈ దాడుల్లో ఏజీఓ ఎస్వీ లక్ష్మీనారాయణ,శివకుమార్, మండల వ్యవసాయాధికారి కె ఏసుబాబు పాల్గొన్నారు.

మొండి గోడలే మిగిలాయ్..!

- అసంపూర్తిగా పాఠశాల తరగతి గదులు
- సౌకర్యాల లేమితో విద్యార్థుల ఇక్కట్లు
- నిర్మాణాలపై కూటమి ఉదాసీన వైఖరి



అసంపూర్తిగా తెలికిచెర్ల ఉన్నత పాఠశాల భవనం



కృష్ణమ్మగూడెంలో పునాదిలోనే ఆగిపోయిన భవన నిర్మాణం

నల్లజర్ల: సమగ్ర శిక్షా నిధులతో మండలంలో రెండేళ్ల క్రితం ప్రారంభమైన తెలికిచెర్ల, అనంతపల్లి, కృష్ణమ్మగూడెం పాఠశాల భవనాలు నేటికి అసంపూర్తిగానే మిగిలి మొండిగోడలుగా దర్శనమిస్తున్నాయి. నాడు-నేడు ఫేజ్-1లో 33 పాఠశాలలకు టాయిలెట్లు, డ్రింకింగ్ వాటర్, ఫర్నిచర్, ప్రహరీ గోడలు, రంగులు, విద్యుత్ సౌకర్యం తదితదర అంశాలు పూర్తి చేశారు. రెండవ దశలో 40 అదనపు తరగతి గదులు మంజూరువగా కొన్నిపూర్తి కాగా, మరికొన్ని 75 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారి అధికారం చేపట్టిన కూటమి 15 నెలలు గడుస్తున్నా పనులను నిర్లక్ష్యంగా వదిలి వేయడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు తరగతి గదులు సరిపోక, కూర్చునేందుకు సరిపడా స్థలం లేక సతమతమవుతున్నారు. మరోపక్క ఉపాధ్యాయులకు సైతం పాఠాలు బోధించేందుకు కష్టతరమవుతోంది. ఒక్కో గదిలో రెండు తరగతులను నిర్వహిస్తుండడంతో విద్యార్థులు చదువుపై ఏకాగ్రతను కోల్పోతున్నారని తల్లిదండ్రులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

తెలికిచెర్లలో కొత్తగా కమతంగుంటలో ఏర్పాటు చేస్తున్న ఉన్నత పాఠశాలకు రూ.1.50 కోట్లతో 2ఎకరాల విస్తీర్ణంలో 9 తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. వంటగది, కాంపౌండ్ వాల్, టాయిలెట్లు నిర్మించవలసి ఉంది. నిర్మాణాలు ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా ఇప్పటికీ అక్కడ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. గ్రామంలో ఉన్న పాఠశాలలో 1 నుంచి పదో తరగతులు ఒకే చోట నిర్వహిస్తుండటంతో 500 మంది విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఆట స్థలం సైతం లేదని వాపోతున్నారు. దీంతో చిన్నారులు చదువులో వెనకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నేతల ఆగడాలు

పనులు పూర్తి చేయడానికి కావాల్సిన నిధులు పాఠశాల ఖాతాలో ఉన్నప్పటికీ నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ శ్రేణులు చేపట్టడంతో స్థానిక కూటమి నేతలు పట్టుబట్టి పనులు నిలుపుదల చేయించారు. దీంతో 100 బస్తాల సిమెంట్ సైతం గడ్డకట్టిపోయింది. అనంతపల్లి జెడ్పీ హైస్కూల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగానే నిలిచిపోయింది. అనంతపల్లి శివారు కృష్ణమ్మగూడెం ప్రాథమిక పాఠశాలలో రూ.13 లక్షలతో అదనపు ఒకటో తరగతి గది నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాక ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయి ఇప్పుడు మొండిగోడలే దర్శనమిస్తున్నాయి.

త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి



తెలికిచెర్లలో విద్యార్థుల అవస్థలు చూసి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఉన్నత పాఠశాలకు స్థలం చేకూర్చి అన్ని అనుమతులు తీసుకువచ్చి నిధులు తీసుకువచ్చాం. దాదాపు 75 శాతం పనులు పూర్తి చేయగా కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థుల ఇక్కట్లు తీర్చాలి.

కరక శ్రీను, పూర్వపు విద్యాకమిటీ చైర్మన్, తెలికిచెర్ల

అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా..



తెలికిచెర్ల శివారు కమతం గుంటలో 2ఎకరాల విస్తీర్ణంలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు శ్రీకారం చుట్టాం. దాదాపు రూ.1.50 కోట్లు మంజూరవ్వగా 75 శాతం పనులు పూర్తయ్యాయి. భవనాలు అసాంఘీక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

నక్కా పండు, ఉపసర్పంచ్, తెలికిచెర్ల

ముమ్మరంగా డ్రెయిన్ పనులు



బాబూజీనగర్‌లో వర్షపునీరు వెళ్లడానికి తాత్కాలింగా ఏర్పాటు చేసిన కచ్చా డ్రెయిన్



నిడదవోలు: పట్టణంలో 26వ వార్డు బాబూజీనగర్ శుక్రవారం మున్సిపల్ అధికారులు కచ్చా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. ఈనెల 16 వినరు మా గోస అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి ఆదేశాల మేరకు మున్సిపల్ ఏఈ హేమంత్ శ్రీనివాస్ బాబూజీనగర్ శివారున అధ్వానంగా తయారైన రోడ్లకు ఇరువైపులా మురుగునీరు పారుదలకు పొక్లెయిన్‌తో కచ్చా డ్రెయిన్‌లు తీయించారు. వర్షపునీరు నిల్వ లేకుండా తగిన చర్యలు చేపట్టారు. వార్డులో ఖాళీ స్థలాల్లో గుబురుగా పెరిగిపోయిన పిచ్చిమొక్కలను తొలగించారు.

దళిత రణభేరి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పట్టణంలో దళిత రణభేరి వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నిడదవోలు: విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఈనెల 24న చేపట్టనున్న దళిత రణభేరి ధర్నా వాల్‌పోస్టర్లను బీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం ఆవిష్కరించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి దళితులపై అనేక చోట్ల దాడులు చేయడం జరుగుతోందన్నారు. దళితుల పక్షాన నిలబడి పోరాడే ఒకే బీఎస్పీ దళితులను చైతన్యం చేసి కూటమి ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈనెల 24న నిర్వహించనున్న దళిత రణభేరి ధర్నాకు రాష్ట్రంలో ఉన్న బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వాదులు, దళిత సంఘాల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బయ్యే మునీంద్ర, తాడేపల్లి రాజన్‌బాబు, నెలపూరి రత్నాజీ, తలారిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థతో కూటమి కుట్రలు

- చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీసులు
- మాజీ హోం మంత్రి గృహ నిర్బంధం



నల్లజర్లలో వనితకు నోటీసులు అందిస్తున్న సీఐ బాలశౌరి



తాడిమళ్లలో మానుకొండ చంద్రబాబును హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న గోపాలపురం వైఎస్సార్ సీపీ నేతలు

నల్లజర్ల: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రాజమహేంద్రవరం వెళ్లడానికి సిద్ధమవుతున్న మాజీ మంత్రి తానేటివనితకు నల్లజర్లలో పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆమె నల్లజర్లకు వచ్చారన్న వార్త తెలియగానే నియోజకవర్గ స్థాయి నాయకులంతా నల్లజర్ల తరలివచ్చారు. అనంతరం వీరంతా రాజమహేంద్రవరం బయలుదేరి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు అక్కడికి చేరుకుని నిరసనకు వెళ్లకుండా అడ్డుపడ్డారు. ఆమె వెంట నాయకులు బంక అప్పారావు, యువరాజు, శ్రీకాకుళపు ఆదిత్య, ముప్పిడి వెంకటరత్నం, సయ్యద్ మునాఫ్, తాడిగడప శ్రీనివాసరావు, చిన్నీ నాగూ యాదవ్, ఏవీఆర్, మండల మహిళా అధ్యక్షురాలు యజ్జవరపు లక్ష్మి, బొప్పన సత్యనారాయణ, ప్రత్తి మురళీ, చిట్లా వెంకటేశ్వరావు ,మట్టాలక్ష్మి, మద్దూరి నాగేశ్వరావు, అచ్యుత తేజ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం

నిడదవోలు రూరల్: సీఎం చంద్రబాబు ప్రతి విషయాన్ని వ్యాపార కోణంలోనే ఆలోచిస్తారని, అందులో భాగంగానే వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు చర్యలు తీసుకోవడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం చలో మెడికల్ కాలేజ్ శాంతియుత నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమైన చంద్రబాబును మండలంలోని తాడిమళ్లలోని ఆయన స్వగృహంలో శుక్రవారం సమిశ్రగూడెం పోలీసులు నోటీసులు అందించి హౌస్ అరెస్ట్ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదవాళ్లకు వైద్య విద్య దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. భవిష్యత్‌లో రాష్ట్ర ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

గళమెత్తిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

దేవరపల్లి: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలో చేపట్టిన చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమానికి గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున తరలి వెళ్లి నిరసన గళం వినిపించారు. నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నప్పటికి అడ్డంకులను తొలగించుకుని పార్టీ శ్రేణులు ఉత్సాహంతో తరలి వెళ్లారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని, వైద్య విద్యార్థులు, యువతతో కలిసి ఉద్యమం చేపడతామని ఆమె హెచ్చరించారు.

అబద్ధాలే చంద్రబాబు పెట్టుబడి

- ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి
- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ధ్వజం



దారవరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: అబద్ధాలే పెట్టుబడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు విమర్శించారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని దారవరంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సీఎంగా జగనన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరైనా ఎన్నికల హామీలేవీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన ఒకట్రెండు పథకాలు కూడా అరకొరగా అమలు చేశారని దుయ్యబట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాయన్నారు. ప్రజలను ఏ విధంగా మోసం చేయాలో చంద్రబాబుకు బాగా తెలుసని, అది ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు.

రాష్ట్రాన్ని దోచేస్తున్నారు

తలారి వెంకట్రావు మాట్లాడుతూ అమరావతి, పోలవరం పేరిట కూటమి నాయకులు ప్రజలను మోసం చేస్తూ రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని ఆరోపించారు. చంద్రబాబు కూడా తన వారికి మాత్రమే కడుపు నింపుతున్నారని, ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. ఆడ బిడ్డలకు ప్రతినెలా ఇస్తానన్న రూ.1500, నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ వంటి హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలంతా గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో వారే కూటమికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరస్వామి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, దారవరం సర్పంచ్ మద్దుకూరి రవి ప్రసాద్, నాయకులు గెడా శ్యామ్, ఉండవల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి హారతికి ఏర్పాట్లు చేయండి



కొవ్వూరులో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రాణి సుస్మిత

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో అక్టోబర్ 27న కార్తిక సోమవారం సందర్భంగా గోదావరి హారతిని వైభవంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాణి సుస్మిత మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రతి శాఖ పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా పోలీసులు పర్యవేక్షించాలన్నారు. భక్తుల ఆరోగ్య భద్రత దృష్ట్యా వైద్య శిబిరాలు నిర్వహించాలని అన్నారు. గోదావరిలో పంట్లు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పీఆర్ ఆనంద తీర్థాచార్య మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం - దాస సాహిత్య ప్రాజెక్ట్ సౌజన్యంతో గోదావరి హారతి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఈవీ సుబ్బారావు, పురపాలక సంఘ మేనేజర్ ఎం.భరత్‌బాబు, మత్స్యశాఖ ఏడీ ఎస్‌కే దిల్షద్, దాస సాహిత్య ప్రాజెక్ట్ సిబ్బంది పంపన త్రిమూర్తులు, కలగర శ్రీనివాస్, నిమ్మగడ్డ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పురుషోత్తపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

నిడదవోలు రూరల్: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.ఆశారోహిణి సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం, పురుషోత్తపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్రీయ పోషణ మాసం అవగాహన కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఆశారోహిణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్టర్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే అభివృద్ధి

నల్లజర్ల: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పోతవరం పీహెచ్‌సీ డాక్టరు సిరాజుద్దీన్ పేర్కొన్నారు. పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో మహిళలు, చిన్నారులకు వైద్యసేవలు అందించారు. మహిళలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు

పెరవలి: గ్రామంలో ఈ నెల 17న నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా పెనుమంట్ర మండలం భట్లమనుగూరు గ్రామానికి చెందిన మహాశివబట్టు లక్ష్మీనారాయణ పట్టుపడ్డాడని తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేసి తణుకు కోర్టులో హాజరు పరచగా ఈరోజు 3 రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

131 మంది మహిళలకు వైద్య పరీక్షలు



బాధితులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తాళ్లపూడి: తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రక్కిలంక గ్రామంలో ''స్వస్థ నారీ-స్వ సక్తి పరివార్'' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ హారిక గుప్తా ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 9 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు, స్వల్ప రోగాలతో బాధపడతున్న మరో 45 మంది రోగులను గుర్తించి చికిత్స అందించారు. మొత్తం 131 బాధితులకు ఈ వైద్య సేవలు అందించామని వైద్యాధికారిణి తెలిపారు. టీబీ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వానిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి యాళ్ల బాబురావు, కందుల నాగు, సీహెచ్‌వో ఎం .వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

నిడదవోలు రూరల్: మార్కొండపాడు పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది మండలంలోని పురుషోత్తపల్లి గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ యోజనలో భాగంగా మహిళలకు శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 197 మంది మహిళలలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పెరవలి: మండలంలోని కాకరపర్రులో పేకాట శిబిరంపై పెరవలి పోలీసులు శుక్రవారం మెరుపు దాడి చేయడంతో ఐదుగురు జూదరులు, రూ.2280 నగదు లభ్యమైనట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. వీరందరిపై కేసు నమోదు చేసి తణుకు కోర్టులో హాజరు పరిచామని తెలిపారు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైటర్లు

తాళ్లపూడి: ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో రిజిస్ట్రేషన్ల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలువురు డ్యాక్యుమెంట్ రైటర్లు తెలిపారు. వేగేశ్వరపురంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం 'పెన్ డౌన్' పేరుతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ ఓటీపీ విధానం వల్ల రిజిస్ట్రేషన్ సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ కొత్త విధానం వల్ల తమకి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రజలకు సౌలభ్యంగా వుండే విధానం అమలు చేయాలని రైటర్ల సంఘం అధ్యక్షులు గుండా రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.కృష్ణమూర్తి, ఆకుల గణేష్, మారిశెట్టి వీరపండు, వారణాసి పాల్గొన్నారు.

'లేపాక్షి'లో నేటి నుంచి డిస్కౌంట్ విక్రయాలు

సీటీఆర్ఐ: దసరా సందర్భంగా లేపాక్షి ఎంపోరియంలో శనివారం నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకూ డిస్కౌంట్ విక్రయాలు జరుగుతాయని మేనేజర్ జి.మోనిక తెలిపారు. ఎంపిక చేయబడిన హస్తకళలు, చేనేత వస్త్రాలపై 10 నుంచి 15 శాతం వరకూ తగ్గింపు ఇస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం శాఖలో ఈ డిస్కౌంట్ ప్రకటించినట్టు తెలిపారు. దసరా సందర్భంగా ప్రత్యేకమైన బొమ్మల కొలువును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.